క్లుప్తంగా

ఉత్సాహంగా 'బడికి పోతా'



వైఎస్సార్ కాలనీలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

ఏలూరు రూరల్ : పద్నాలుగేళ్ల పిల్లలు అందరూ పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్చుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఆర్ రంగయ్య అన్నారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్ కాలనీ మండల పరిషత్ పాఠశాల పరిసరాల్లో బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంగయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బడి బయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలన్నారు. పిల్లలు విద్యావంతులైతేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద పిల్లలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్, షూ, యూనిఫాంతో పాటు ఉచితంగా నాణ్యమైన భోజనం అందిస్తుందన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల హెచ్ఎం జయలక్ష్మి, పోణంగి పాఠశాల ఉపాధ్యాయులు కందుల రాంబాబు, లక్ష్మి, జీజేఏ స్టీవెన్, సూర్యకుమారి, కిరణ్ కుమారి తదితరులు తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు బడిలో భద్రత, భవిష్యత్తు, శిక్షణ ఉందని నినాదాలు చేశారు. పలువురు తల్లులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలకు బడికి పంపేందుకు సన్నద్ధులను చేశారు.

జాలిపూడిలో పారిశుద్ధ్య పనులు చేయాలి

ఏలూరు రూరల్: జాలిపూడి ఎస్సీ కాలనీలో తక్షణం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎస్సీ కాలనీ పెద్ద సీరియల్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా ఎస్సీ కాలనీ పరిసరాల్లో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేయడం లేదన్నారు. కాలనీలో మురుగునీరు, చెత్త చెదారంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఇదేమని సిబ్బందిని ప్రశ్నిస్తే గ్రామ టీడీపీ నాయకులు ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టవద్దన్నారని చెప్పారన్నారు. కొందరు టీడీపీ నాయకులు పంచాయతీ పాలన వ్యవహారాలు పరివేక్షిస్తూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే నెపంతో ఎస్సీలు నివసిస్తున్న ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు

- ఈ ఏడాదీ పథకం కొనసాగింపు
- 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలకు ఉచితం
- 20 కిలోమీటర్లు దాటితే రాయితీపై పాసులు
- ఏలూరు డిపో పరిధిలో గతేడాది 4,277 మందికి ఉచిత పాసులు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించి అక్షరాస్యత పెంచడంలో ఆర్టీసీ తాను సైతం అని ముందుకు వచ్చింది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా విద్యార్థులకు, వికలాంగులకు ఉచిత బస్‌పాసులు అందిస్తోంది. 20 కిలోమీటర్లకు పైగా దూరం వెళ్లే విద్యార్థులకు రాయితీతో కూడిన బస్‌పాసులను మంజూరు చేస్తోంది. ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు, ఏలూరు డిపోల పరిధిలో గతేడాది మొత్తం 10,014 ఉచిత బస్ పాసులు అందిస్తుండగా ఒక్క ఏలూరు డిపో పరిధిలోనే ఈ పాసులు అత్యధిక సంఖ్యలో మంజూరు చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులకు ఊతమిచ్చేలా ఆర్టీసీ ఇస్తున్న ఉచిత పాసులు ఆయా వర్గాల పిల్లలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయి. గతేడాది ఇచ్చినట్టుగానే ఈ ఏడాది కూడా విద్యార్థులకు పాసులు మంజూరు చేయడానికి ప్రజా రవాణా అధికారులు ఏర్పాటు చేశారు. గతేడాది పాసులు మంజూరు చేసిన వారికి ఈ ఏడాది వాటిని రెన్యువల్ చేయడానికి ఈ ఏడాది కొత్తగా పాసులు కావాల్సిన వారికి వివిధ గుర్తింపు కార్డులను, అనుమతులను పరిశీలించి పాసులు జారీ చేయడానికి కసరత్తు ప్రారంభించారు.

12 ఏళ్లలోపు బాలురుకి, 18 ఏళ్లలోపు బాలికలకు ఉచిత పాసులు

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సరైన విద్యా సంస్థలు అందుబాటులో లేక తమ సమీపంలోని పట్టణాలకు వెళ్లి విద్యాభ్యాసం చేస్తుంటారు. అటువంటి వారిలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులే ఉంటారు. వారు నిత్యం బస్సు ఛార్జీలు చెల్లించి తమ విద్యా సంస్థలకు వెళ్లడం ఆర్థికంగా భారంగా పరిణమిస్తోంది. అటువంటి ఆర్థిక భారాన్ని కొద్దిగానైనా తగ్గించాలనే లక్ష్యంతో ప్రజా రవాణా శాఖ ఈ ఉచిత పాసులను విద్యార్థులకు మంజూరు చేస్తోంది. 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్ల వయసులోపు బాలికలకు ఈ ఉచిత బస్‌పాసులను మంజూరు చేస్తున్నారు. ఈ పాసుల ద్వారా విద్యార్థులు తమ గ్రామాల నుంచి 20 కిలోమీటర్ల వరకూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు. ఆ ఉచిత బస్ పాసులు పొందడానికి విద్యార్థులు తమ ఫొటో, వారు చదువుతున్న విద్యా సంస్థ యాజమాన్యం నుంచి (బోనఫైడ్ సర్టిఫికెట్), ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.

ఏలూరు డిపో పరిధిలో గతేడాది 11,741 పాసులు

ఏలూరు ఆర్టీసీ డిపో పరిధిలో గతేడాది విద్యార్థులకు ఉచిత బస్‌పాసులు, రాయితీ పాసులు, దివ్యాంగులకు మంజూరు చేసిన పాసులు కలిపి మొత్తం 11,741 ఉన్నాయి. వీటిలో ఉచిత పాసులు 4,277, దివ్యాంగులకు ఉచిత పాసులు 645 ఉన్నాయి. విద్యార్థులకు ఇచ్చే రాయితీ పాసులు నెలవారీకి సంబంధించనవి 3,470, మూడు నెలలకు సంబంధించినవి 3,261, సంవత్సర కాల పరిమితికి ఇచ్చేవి 88 ఉన్నాయి.

ఈ పాసులు ఎలా పొందాలి

రాయితీ పాసులు, ఉచిత పాసులు పొందడానికి లబ్ధిదారులు ప్రజా రవాణా సంస్థ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తు సమర్పించాలి. కొత్తగా దరఖాస్తు చేసుకునే కళాశాల విద్యార్థులు తమ 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీ జత చేయాలి. స్టడీ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్టు ఫొటో, మొబైల్ నెంబర్ ఇవ్వాలి. దరఖాస్తులను డిపో మేనేజర్లు పరిశీలించి పాస్ మంజూరుకు సిఫార్సు చేస్తారు. వీటిని ఏలూరులోని ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంపై భాగంలో ఉన్న పాసుల జారీ కౌంటర్ వద్ద తీసుకోవాలి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు అందించే ఉచిత బస్ పాసులను అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలి. 20 కిలోమీటర్లకు పైబడి దూరం ఉన్న విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు రాయితీతో కూడిన పాసులు మంజూరు చేస్తున్నాం. పేద విద్యార్థులకు పాసులు అందించడానికి, గుర్తింపు కార్డులు అందించడానికి ఒక్కోసారి దాతలు ముందుకు వస్తున్నారు. విద్యార్థుల అభివృద్ధిలో ఆర్టీసీ కూడా కీలకంగా వ్యవహరిస్తోంది. పరీక్షల సమయంలో సైతం విద్యార్థులకు అనుకూలంగా పరీక్షా కేంద్రాల వద్దకే బస్సులను తిప్పుతున్నాం.

– ఎన్‌వీఆర్ వరప్రసాద్, ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి

20 కిలోమీటర్లు దాటితే రాయితీపై పాసులు

తమ గ్రామాల నుంచి 20 కిలోమీటర్ల కన్నా ఎక్కువ దూరంలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు కూడా ధరల వెసులుబాటుతో ఆర్టీసీ రాయితీ బస్ పాసులు మంజూరు చేస్తోంది. ఈ మేరకు ఛార్జీలో విద్యార్థి ఒక వంతు చెల్లిస్తే సరిపోతుంది. ఈ రాయితీ పాసును 50 కిలోమీటర్ల పరిధి వరకూ విద్యార్థులకు మంజూరు చేస్తారు. రాయితీ బస్ పాసులను ఒకనెల, మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సర కాలపరిమితితో మంజూరు చేస్తారు. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ నెల వరకూ, ఐటీఐ, పారా మెడికల్ కోర్సులు చదివే విద్యార్థులకు మే నెలలో సైతం పాసులు మంజూరు చేస్తారు. దీని కోసం విద్యార్థులు పాసు ధరతో పాటు సంవత్సరం వరకూ గుర్తింపు కార్డుకు రూ.100, నెలవారీ గుర్తింపు కార్డుకు రూ. 50, సర్వీసు ఛార్జీగా మరో రూ. 40 అదనంగా చెల్లించాలి. గతేడాది పాసు పొందిన వారు రెన్యువల్ కోసం సంబంధిత విద్యా సంస్థ ప్రిన్స్‌పాల్, ప్రధానోపాధ్యాయుల సంతకంతో కూడిన సిఫార్సు లేఖను ఆర్టీసీకి సమర్పించాలి. వీరితో పాటు దివ్యాంగులకు సైతం ఆర్టీసీ ఉచిత బస్‌పాసులు మంజూరు చేస్తోంది. ఈ పాసులు పొందడానికి దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌ను, ఆధార్ కార్డు, అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్‌ను ఆర్టీసీకి సమర్పించాలి. అర్హులైన దివ్యాంగులకు మూడేళ్ల కాలపరిమితితో పాసులు మంజూరు చేస్తారు. ఐతే గుర్తింపు కార్డుకు మాత్రమే వారు రూ.100 ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంటుంది.

తలసేమియా చిన్నారులకు అండగా ఉంటాం

రెడ్‌క్రాస్‌లో రక్త మార్పిడి చికిత్స



తలసేమియా చిన్నారులను పరామర్శిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ కృష్ణారెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స అందించామని రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా నివారణ దినోత్సవం సందర్భంగా 11 మంది చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సికిల్‌సెల్ అనేది జన్యుపరమైన, రక్తసంబంధిత వ్యాధి అని ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ఈ వ్యాధి ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు. పౌష్టికాహారం, వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజన, పౌష్టికాహారం పంపిణీ చేశామని తెలిపారు. మానవత సంస్థ సభ్యులు పరిమి భాగ్యలక్ష్మి, దేవినేని భాస్కరరావు, వీటికి సహకారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, రత్నాకరరావు, కేవీ రమణ ఉన్నారు.

ఉపాధి హామీ పనులు నిలిపివేయడం తగదు

ఏలూరు (టూటౌన్): దెందులూరు, పెదవేగి మండలాల్లో ఉపాధి హామీ పనులు నిలిపివేయడం తగదని, దీంతో ఉపాధి కూలీలు నానా అవస్థలు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ జిల్లా డ్వామా అధికారులపై మండిపడ్డారు. బుధవారం జిల్లా డ్వామా ఆఫీసు కార్యాలయంలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం తపాలాలో అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి వెళితే కనీసం పట్టించుకుని సమస్యను పరిష్కారం చూపేందుకు అధికారులు కరువయ్యారన్నారు. ఒక పక్క అవినీతి అక్రమాలకు నిలయంగా ఉపాధి హామీ కార్యాలయాలు మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఉపాధి హామీ పనులు చేస్తుంటే దెందులూరు, పెదవేగి మండలాల్లో ఎందుకు నిలిపి వేశారంటూ ప్రశ్నించారు. పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు వారి సమస్యలను అధికారులకు విన్నవించుకోవటానికి వస్తే కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు ఇలా పనులు నిలిపివేయడం వల్ల ఉపాధి కార్మికులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఒక పక్క అవినీతి అక్రమాలకు నిలయంగా మారిన ఉపాధి హామీ కార్యాలయాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. జీలుగుమిల్లి మండలంలో ఏపీఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పి.అంకపాలెం, దర్భగూడెంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోయినా, పనిచేయకపోయినా వారి పేర్లతో జీతాలు డ్రా చేసుకొని అక్రమంగా చట్ట వ్యతిరేకంగా ఉపాధి నిధులు స్వాహా చేసుకుంటున్న ఏపీఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.

దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతదేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏలూరు నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ భారత్ జోడో యాత్రతో రాహుల్ దేశ ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, వారి సమస్యల పరిష్కారానికి రాహుల్ దేశానికి ప్రధాని కావాలన్నారు. రాహుల్ ఆలోచనా విధానాలు దేశభద్రతకు, అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని, రాబోయే రోజుల్లో రాహుల్‌ను దేశ ప్రధానిగా చూడడం తథ్యమన్నారు. తొలుత రాహుల్ గాంధీ పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ నాయకులు ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, లంకా రామ్మోహన్, తాళ్ళూరి చక్రవర్తి, కొమ్మన సాంబశివరావు, దాసరి రాంప్రసాద్, తీడ సత్యనారాయణ, దండుబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.



• నిబంధనలు పట్టవా ?

వాహనానికి నంబర్ ప్లేట్లు చాలా ముఖ్యమైనవి. ఆ నంబరుతోనే ఏదైనా ప్రమాదం జరిగినా, వాహనాలు చోరీకి గురైనా పట్టుకునేందుకు వీలుంటుంది. రవాణాశాఖాధికారులు హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు వాడాలని, నిబంధనలు పాటించకపోతే వాహనాలు సీజ్ చేస్తామని చెబుతారేగాని ఆచరణలో అశ్రద్ధ కనపబరుస్తున్నారు. దానికి ఉదాహరణే ఈ నంబర్ ప్లేట్లు. వాహనానికి నంబరు ఉండాల్సిన స్థానంలో ఎవరికి ఇష్టం వచ్చినట్లుగా వారు అభిమానించే వ్యక్తుల పేర్లు రాసుకుని యథేచ్ఛగా తిరుగుతున్నా ఇటు ట్రాఫిక్ పోలీసులు, అటు ఆర్టీఓ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలి



భీమడోలులో నేను బడికి పోతా లక్ష్యాలను వివరిస్తున్న ఎంపీడీవో టి.స్వర్ణలత

భీమడోలు: బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని భీమడోలు ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా అనే కార్యక్రమంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో టి.స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీ, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలందరిని ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలన్నారు. చేరకుంటే వారి నుంచి కారణాలు తెలుసుకోవాలన్నారు. ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చేరే విద్యార్థులకు నాణ్యమైన విద్య, యూనిఫారమ్, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్టూడెంట్ కిట్లను ఉచితంగా అందిస్తామన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సదుపాయాలు, కనీస సదుపాయాలు కల్పిస్తుందన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	70	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	52	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	52	ములక్కాడలు	07, 10
బెండకాయలు	44	కంద	64
పచ్చిమిర్చి	56	బీట్‌రూట్	40
కాకర కాయలు	56–68	కీరా దోస	50
బీరకాయలు	64	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	72	అల్లం	180
క్యాబేజీ	38	కొత్తిమీర (కట్ట)	20–40
క్యారెట్	40–56	పాలకూర	12
దొండకాయలు	40	చుక్కకూర	12
బంగాళదుంపలు	36	తోటకూర	12
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	72	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
అనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	--
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

సర్పంచ్ పదవి రాజ్యాంగ హక్కు



డాక్టర్ మెండెం సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): సర్పంచ్ పదవి రాజ్యాంగ హక్కు మాత్రమే అని రాజకీయ హక్కు కాదని ఎస్సీ సర్పంచ్‌ల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్ పంచాయతీ రాజ్ వ్యవస్థ అంశాన్ని తెలియజేస్తుందన్నారు. 1994 పంచాయతీ రాజ్ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలులోకి తీసుకువచ్చారని అన్నారు. ఈ చట్టంలో సర్పంచ్‌కి జాతీయ స్థాయిలో రాజ్యాంగ బద్ధ హక్కు ఇచ్చారని గుర్తు చేశారు. సర్పంచ్‌లను రాజకీయ పార్టీలు తక్కువ చేసి చూడటం సరికాదన్నారు. రాష్ట్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీరాజ్ మంత్రి దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కోరారు. ఎస్సీ సర్పంచులున్న చోట ఇతరుల రాజకీయ పెత్తనం ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం సర్పంచ్‌లకు అందిస్తున్న రూ.3వేల గౌరవ వేతనాన్ని రూ.10వేలకు పెంపుదల చేయాలని సంతోష్ కుమార్ కోరారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఏలూరు టౌన్: తన ఇంటి డాబాపై నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును అగంతకులు తెంచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర శివారు చాటపర్రు రోడ్డులోని గీతా కాలనీలో నివాసముంటున్న రమాదేవి ఈనెల 18 రాత్రి తన ఇంటి డాబాపై పడుకుని ఉండగా ఆమె మెడలోని రెండు కాసుల బంగారు గొలుసు దొంగలు తెంచుకుపోయారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్: లారీపై ఎత్తుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన కోటేశ్వరరావు (42) ఈనెల 16 రాత్రి సత్రంపాడులో లారీలో ఊక లోడు ఎత్తుతుండగా పై నుంచి పడి తీవ్రగాయాల పాలయ్యాడు. కోటేశ్వరరావును ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దీనిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.